క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు నిరసన తెలియజేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మంగళగిరి పద్మ, గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ, నాయకులు జయలక్ష్మి, వి.లక్ష్మీనారాయణ, రాచూరి వెంకటేశ్వర్లు, మరియమ్మ, సుజాత, శారమ్మ, అనురాధ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



తెనాలిఅర్బన్: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 7,8,9 వార్డుల్లోని 19 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రోజున చిన్నారులకు వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్ర బాబు, విజయలక్ష్మి, అరుణ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని జూపల్లి వంశీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్వరాజ్ థియేటర్ సెంటర్‌లో గురువారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను రామకృష్ణ కట్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, లక్కి, తేజ, జాషువా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో వర్షం



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో గురువారం సాయంత్రం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. ఉదయం వరకు ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో కొంత సేదతీరారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి విడతల విడతలుగా వర్షం కురుస్తునే ఉంది. దీంతో అక్కడక్కడ కొన్ని రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. పాదచారులు, వాహనదారులు దీనివలన కొంత ఇబ్బంది పడ్డారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నిక, హాఫ్‌పేట గ్రామంలో వార్డు మెంబరు. ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 19వ తేదీన జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడి ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

తురకపాలెంలో ఇంటింటి సర్వే

మేడికొండూరు: డోకిపర్రు శివారు తురకపాలెంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ సిబ్బంది, గుంటూరు వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అనుమానితులను గుర్తించి ముందస్తు నివారణ అవగాహన చేశారు. ప్రధానంగా ఆహార నియమావళిపై ప్రతి ఒక్కరూ కొన్ని నిబంధనలు పాటించాలని తెలిపారు. పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. డాక్టర్ కె.విష్ణునందన్, డాక్టర్ వై.రవీంద్రకుమార్, మేడికొండూరు పీహెచ్‌సీ సీహెచ్ఓ రామారావు, డీఈఓ సుధా, పలువురు హౌస్ సర్జన్‌లు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- బెంబేలెత్తుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఆర్ఆర్ నగర్‌లో జనసంచార మధ్య వీధికుక్కలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. కుక్కలు ప్రజలపై దాడులు చేస్తుండడంతో...ఆందోళనకు గురి అవుతున్నారు. గతంలో వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలేసి వచ్చేవారు. కానీ నేడు ఆపరిస్థితి లేకపోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తెనాలి పట్టణంలో 2022లో మున్సిపల్ సిబ్బంది చేసిన సర్వే ప్రకారం 977 వీధి కుక్కలు ఉన్నట్లు నిర్ధారించారు. వాటిలో 800 కుక్కలను పట్టుకుని బుర్రిపాలెం రోడ్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయంలో పిల్లలు పుట్టకుండా శస్త్ర చికిత్సలు చేసి వాటిని పట్టుకున్న ప్రాంతంలోనే వదిలేశారు. మిగిలిన వాటిని విస్మరించారు. దీంతో పట్టణంలో వీటి సంఖ్య గణనీయంగా పెరిగాయి. పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో కుక్కల సంఖ్య వందలలోనే ఉన్నాయంటే వాటి తీవ్రత ఏమేరకు ఉందో మనకు అర్థమౌతుంది.

రోజుకు 15 నుంచి 20 మందిపై దాడులు...

పట్టణంలోని వీధి కుక్కలు పాదచారులు, వాహనదారులపై తరచు దాడులు చేస్తున్నాయి. ఈవిషయాన్ని జిల్లా వైద్యశాలలోని గణంకాలు నిర్ధారిస్తున్నాయి. ప్రతిరోజు కుక్క కాటుకు గురై తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఇంజక్షన్లు చేయించుకునే వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటుంది. దీనిని బట్టి చూస్తే నెలకు సుమారు 500 నుంచి 600 వరకు వీటిబారిన పడుతున్నట్లు మనకు అర్థమౌతుంది. అయితే ప్రభుత్వం కుక్క కాటు ఇంజక్షన్‌లు ప్రభుత్వ వైద్యశాలలో కావాల్సిన మేరకు అందుబాటులో ఉంచడం వల్ల చాలా వరకు వాటి బారిన పడి గాయపడిన వారు బాగుపడడంతో పాటు కొంత ధనం కూడా ఆదా అవుతుంది.

కన్పించని చర్యలు...

గతంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందితో వాటిని పట్టుకునే వారు. వాటిని దూర ప్రాంతాల్లో వదిలేసి వచ్చేవారు. కానీ నేడు ఆపరిస్థితి కన్పించడం లేదు. మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి వదిలేస్తున్నారు. దీంతో అవి అక్కడే తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



పట్టణంలో వీధి కుక్కలు కన్పిస్తే వెంటనే మాకు తెలియజేయండి. వాటిని ప్రత్యేక సిబ్బందితో పట్టించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి పట్టుకున్న ప్రాంతంలో వదిలేస్తాం. అదే పిచ్చి కుక్కలు అయితే వెటర్నరి అధికారుల సూచనల మేరకు వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

–ఎం. జశ్వంతరావు,
కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

విశ్వమానవుడు సంజీవదేవ్



సంజీవదేవ్

తెనాలి: సుప్రసిద్ధ రచయిత, చిత్రకారుడు, మనోవైజ్ఞాని, మానవతావాది డాక్టర్ సంజీవదేవ్ 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 19న ఆయన స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలో 'ఎప్పటికీ..అందరికీ..సంజీవదేవ్' పుస్తకావిష్కరణ జరగనుంది. సంజీవదేవ్ నివాసం 'రసరేఖ' ప్రాంగణంలో జరిగే సభకు ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహిస్తారు. ప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. పుస్తక రచయిత ప్రొఫెసర్ లలితానందప్రసాద్, ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ, నండూరి రాజగోపాల్, ఎస్.ఎస్.ప్రసాద్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా సంజీవదేవ్ గురించి...

సంజీవదేవ్ చరాచరుడు. హైస్కూలు దాటని చదువుతో ఇల్లు వదిలాడు. హిమవన్నగ సానువుల్లో విహరించాడు. అసామాన్యులకు ఆంతరంగికుడైనాడు. ఇల్లు చేరి, తుమ్మపూడిలో వేళ్లజొనిపి సహస్ర బాహువులతో వినువీధుల్లో సయ్యాటలాడాడు. లోగిలినుంచే మబ్బుల్నీ, తెరచాప పడవల్నీ చూస్తూ ఎంతగా ఆనందించేవారో..తనలో తాను జీవిస్తూ వివిధ సాహిత్యాలను, భావవాహినులను అధ్యయనం చేస్తూ గడుపుతుండే సంజీవదేవ్‌కు, అసిత్‌కుమార్ హల్దర్ తరచుగా ఉత్తరాలు రాస్తూ, రసజగత్తుకు స్ఫూర్తినీ, చైతన్యాన్నీ అందిస్తూ వచ్చారు. దిలీప్‌కుమార్ రాయ్ రచించిన 'అనామీ' అనే బెంగాలీ పుస్తకం సంజీవదేవ్‌పై చూపిన ప్రభావం, తల్లావఝుల శివశంకరశాస్త్రి గేయనాటికలోని కవితా శిల్పం ఆకర్షించింది. 'కళ-విజ్ఞానము' అనే తొలి వ్యాసం పురుడు పోసుకుంది.

నిరంతర సాహితీస్రవంతిగా...

అక్కడ్నుంచి ఆయన కలం నిరంతర సాహితీస్రవంతిగా మారింది. నీలాకాశంలో దండలా కదిలే కొంగలబారుని, సాయంసంధ్యంలో నీళ్లని చీల్చుకుంటూ అలసటగా సాగే తెరచాప పడవల్ని, మంచు తెరల్లోంచి కనిపించే దేవదారు వృక్షాన్ని, ఎండిన రెల్లు దుబ్బుల్ని మాటల్లో బొమ్మలు కట్టి చూపించి, వాటిలోని సౌందర్యాన్నీ, సురుచినీ తెలుగుజాతి కనుపాపలకు మప్పిన మహాస్రష్టగా గుర్తింపును తెచ్చుకున్నారు. ఇందుకు చిన్ననాటనే మైమరపించిన హిమాలయాలు, ప్రఖ్యాత చిత్రకారులు నికొలస్ రోరిక్, హసిత్‌కుమార్ హల్దర్ సాంగత్యం తోడ్పడ్డాయి. నాలుగు పదుల వయసులో కుంచెను పట్టిన సంజీవదేవ్, చిత్రకళలోనూ ప్రత్యేకతను చాటారు. రూపం నిమిత్తమాత్రంగా, రంగు ప్రధానంగా వర్ణరూప చిత్రణ తీరు భావానుబంధంగా ఉంటుంది. మూడున్నర దశాబ్దాలకు పైగా చిత్రకళా జగత్తులో రూపరచన, అంతకుమించి రంగుల రచనలు చేశారాయన. ఆయన ఎవరివద్ద శిక్షణ తీసుకోలేదు. సాహిత్యంలోనూ, చిత్రకళలోనూ ఔన్నత్యాన్ని అందుకోవటానికి ఆయన జీవనగమనమే కారణమైంది.

రసాత్మక దృష్టితో నిరంతర ఆశావహ దృక్పథంతో జీవించిన విశ్వమానవుడు సంజీవదేవ్. సౌందర్యారాధనలో దివ్యత్వమో, దైవత్వమో ఉందని నమ్మేవారికి సంజీవదేవ్ ఆస్తికుడు. నమ్మనివారికి నాస్తికుడు. కులమతవర్గ బేధాలు తెలియవు. మంచీచెడుల మధ్య అగడ్తలు, అగాథాలు అధిగమించలేనివి కావనేవారు. సంజీవదేవ్ రచనలకు విశ్వమానవత, స్వేచ్ఛ, రసాస్వాదన అనే తాత్విక భూమిక ఉందని అంటారు చౌదరి జంపాల. కొత్తతరం పాఠకులు ఆయన తాత్విక, కళాత్మక దృక్పథాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందంటారు. సంజీవదేవ్ సాంగత్యాన్ని, సాన్నిహిత్యాన్ని అనుభవించి, ఆయన రచనలను విస్తృతంగా అధ్యయనం చేసిన లలితానంద ప్రసాద్, తాజా పుస్తకం, ఆ విశ్వమానవుడి బహుముఖ ప్రతిభ, రసజీవన దృక్పథం, విశ్వమానవ చింతన, తాత్విక ప్రతిపాదనలను మనకు పరిచయం చేస్తుందని అంటారు.

బడిబాట పట్టిన గిరిజన బాలలు



భోజనం ప్లేట్లతో బడిలో చేరిన చిన్నారులతో అంజలి




అంతకుముందు తోటి గిరిజన పిల్లలతో (ఫైల్)

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు గిరిజన చిన్నారుల్లోనూ విద్యపై ఆసక్తిని రేపింది. స్వచ్ఛంద సంస్థ ప్రోత్సాహం, అధికారుల సహకారంతో గిరిజన బాలికలను బడిబాట పట్టించింది. నిన్నటివరకు కాల్వకట్టపై, చెట్లు, పుట్టలవెంట కాలక్షేపం చేసిన పిల్లలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల ఒడిలో పుస్తకాలతో చేరిపోయారు. ఆ వివరాలివి.

ప్రభుత్వం నాడు-నేడు పథకంతో సహా విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు ఎందరో బాలబాలికలను బడిబాట పట్టించిన విషయం తెలిసిందే. ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారులు, డ్రాపవుట్లు కూడా ప్రభుత్వ ఇస్తున్న యూనిఫాం, బూట్లు, ధరించి, పుస్తకాల సంచితో రోజూ స్కూలుకు వెళుతున్నారు. రూరల్ మండలం కొలకలూరులో కొమ్మమూరు కాల్వకట్టపై నివాసముంటున్న గిరిజనులకు పిల్లలను కూడా చదువులమ్మ ఒడికి పంపాలని ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రావూరి అంజలి తలచారు. అక్కడి గిరిజనులకు అవసరమైన సహకారం అందిస్తూ వస్తున్న అంజలి చెప్పిన మాటలను పెద్దలు ఆలకించారు. తమ పిల్లలను బడికి పంపేందుకు తీర్మానించారు. ఫలితంగానే గిరిజన బాలికలు ఇప్పుడు కొలకలూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో మూడోతరగతిలో చేరారు. ఉదయాన్నే పుస్తకాల సంచీతో బడికి దారితీస్తున్నారు. తన ఆలోచన, సంకల్పానికి తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ కె.రవిబాబు, ఎంఈఓ ఎం.లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నాగవేణి, సంక్షేమ కార్యదర్శి త్రివేణి, గ్రామ సచివాలయ సిబ్బంది చేసిన కృషి గొప్పదని అంజలి చెప్పారు. గురువారం ఆమె పాఠశాలకు వెళ్లి గిరిజన బాలికలకు భోజనం ప్లేట్లను అందజేశారు. వీరిని ప్రేరణగా తీసుకుని, మిగిలిన గిరిజన బిడ్డలు కూడా బడిబాట పట్టాలని ఆమె కోరారు. చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదనే వాస్తవాన్ని గిరిజనులు గ్రహించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం విద్యతోపాటు ఉచితంగా యూనిఫాం, బూట్లు, పుస్తకాలను ఇవ్వటమే కాకుండా నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్టు గుర్తుచేశారు. తమ వంతున వారికి తగిన కౌన్సెలింగ్ చేస్తూ సాధ్యమైనంత ఎక్కువ పిల్లలు బడికి వెళ్లేలా ప్రయత్నిస్తానని చెప్పారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



విజేతకు బహుమతి అందజేస్తున్న కేఎల్‌యూ అధ్యాపకురాలు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి ప్రారంభమైన అంతర్జాతీయ యువజనోత్సవాలు గురువారంతో ముగిశాయి. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విజన్, మిషన్ కలిగి కఠోర శ్రమతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ మానవ జీవితంలో అత్యున్నతమైనదని, ఈ దశను సక్రమంగా వినియోగించుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ 77 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో మహిళల స్థానం ఎక్కడ అనే అంశంపైన వ్యాస రచన పోటీలు నిర్వహించగా మొత్తం 120 మంది విద్యార్థినులు ఈ వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారని, యు.హారిత ప్రథమ బహుమతిని, నందిని రెడ్డి ద్వితీయ బహుమతిని, మరొక విద్యార్థి తృతీయ బహుమతిని గెలుపొందారని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, కో కన్వీనర్ డాక్టర్ సోని, కో ఆర్డినేటర్ కోయా సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల రైల్వేవే స్టేషన్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటాక సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఛిద్రమైన మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుర్రిపాలెం హాఫ్‌పేటలలో 144 సెక్షన్

తెనాలిరూరల్: తెనాలి మండలం బుర్రిపాలెం, హాఫ్‌పేట గ్రామాల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రెండు గ్రామాల్లో 144 నిషేదాజ్ఞలను అమలు చేసినట్టు తహసీల్దార్ కె. రవిబాబు గురువారం రాత్రి తెలిపారు. ఎన్నికలు ముగిసి కౌంటింగ్ పూర్తయ్యే వరకు నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు.

టెన్నిస్‌లో కేఎల్‌యూ విద్యార్థికి రజక పతకం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ విద్యార్థి రజత పతకాన్ని సాధించినట్లు క్రీడల విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ గురువారం తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో బీటెక్ ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న పోకల సూర్య ఆకాష్ థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు.

మైనర్ బాలిక అదృశ్యం

తెనాలిరూరల్: మైనర్ బాలిక అదృశ్యమవ్వడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన 18 ఏళ్ల బాలిక డిప్లొమా చదివి ఇంటి వద్ద ఉంటోంది. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రికి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో నుంచి మృతదేహం వెలికితీత

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో చినపల్లె వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వెంబడి వంతెన వద్ద కాల్వలో మృతదేహాన్ని స్థానికులు బుధవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారమందించిన సంగతి తెలిసిందే. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించిన పోలీసులకు అప్పటికే చీకటి పడడంతో మృతదేహాన్ని కాల్వలో నుంచి తీయడానికి వీలు కాలేదు. గురువారం మృతదేహాన్ని కాల్వ నుంచి వెలికి తీశారు. మృతుడి ప్యాంటు షర్టు ధరించి ఉన్నాడు. జేబులో లాఫింగ్ బుద్దా ఫొటో ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగుపడుతున్న కానిస్టేబుల్ ఆరోగ్యం

మరోసారి పరామర్శించిన జిల్లా ఎస్పీ



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం: దేవస్థానంలో దొంగతనానికి పాల్పడిన దుండగల్ని పట్టుకునే ప్రయత్నంలో గాయాలై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి క్రమేణా మెరుగుపడుతోంది. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో దొంగల్ని పట్టుకునే క్రమంలో ఒకడు తెనాలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబును నెట్టడంతో పైనుంచి కిందపడి గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గుంటూరు రేంజ్ అధికారులతో మాట్లాడారు. కానిస్టేబుల్ ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ, మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. దీంతో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ అత్యవసర చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50 వేలను గుంటూరు జిల్లా పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి తక్షణ సాయంగా అందజేశారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా కానిస్టేబుల్‌ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఇక గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ పలుమార్లు ఆస్పత్రికి వచ్చారు. గురువారం మరలా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌తో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించడం వల్లే త్వరగా కోలుకున్నానని కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఆసుపత్రి వైద్యుల్ని ఎస్పీ అభినందించారు. ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వెంట గుంటూరు పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ లక్ష్మిసుధ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మిసుధ

తూములూరు(కొల్లిపర): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ సూచించారు. గురువారం మండలంలోని తూములూరు గ్రామంలో సుగాలీపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు , బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు మరియు బీపీ. షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలోని సుమారు 5 మంది దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగు నీరు గోరు వెచ్చగా ఉంచుకుని తాగాలని సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఫార్మసిస్ట్ బొమ్ము కోటిరెడ్డి, ఎంఎల్‌హెచ్ పి.చిలక భారతి, ఏఎన్ఎం యర్రమాల లలితకుమారి, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ సుదర్శనశాస్త్రి , ఆషా కార్యకర్త ప్రమీల, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

డివైడర్ దిమ్మెలను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ



ముందు భాగం ధ్వంసం అయి నిలచిపోయిన లారీ



ట్రాఫిక్‌తో ప్రజల కష్టాలు

తెనాలిరూరల్: గుంటూరు వైపు నుంచి పట్టణంలోకి వస్తున్న ఓ లారీ పాత బస్టాండ్ వద్ద ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ప్రమాదానికి గురైంది. మాచర్ల నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ చెంచుపేట ఓవర్ బ్రిడ్జి నుంచి మారీసుపేట వైపు దిగే క్రమంలో బ్రిడ్జిడౌన్‌లో ఉన్న డివైడర్ దిమ్మెలను ఢీ కొట్టింది. మితిమీరిన వేగంతో ఢీ కొట్టడంతో డివైడర్ దిమ్మలు చెల్లాచెదురుగా పడిపోవడంతో పాటు లారీ ముందు భాగం ధ్వంసమైంది. ఆయిల్ ట్యాంకర్ లారీ నుంచి విడిపోయి నుజ్జునుజ్జయింది. దీంతో ట్యాంకర్ లో ఉన్న డీజిల్ మొత్తం రోడ్డు మీద పడిపోయింది. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టైంది. లారీ ముందు టైర్లు కూడా విరిగిపోయి పక్కకు తొలగిపోయాయి. విషయం తెలుసుకున్న కంట్రోల్ రూమ్ సీఐ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్‌లు ఉదయం ఘటనా స్థలానికి వచ్చి లారీని అక్కడి నుంచి తీయించే ప్రయత్నం చేశారు. రెండు క్రేన్లు తెప్పించి వాటి సహాయంతో అతికష్టం మీద లారీని పక్కకు జరిపించారు. ప్రమాదానికి కారణమైన లారీని అక్కడి నుంచి తొలగించేందుకు ఉదయం 7 గంటల నుంచి తొమ్మిది గంటల దాకా సమయం పట్టింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు నిలిపి వేయడం, లారీ తొలగించాక ఒకేసారి అన్ని వాహనాలు వదలడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమయంలో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు వైపు కాలేజీలకు వెళ్లే వారంతా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంటూరు వైపు నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ మితిమీరిన వేగంతో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ తెలియజేశారు.

అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులతో శివశంకర్, హెచ్ఎం మౌలాబి

తెనాలిఅర్బన్: ఎస్ఆర్ఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బి.అనిత, బి.శ్రీకర్, కె.రాజేశ్వరి, కె.రామ్ తేజలను గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు చదివి అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను పూర్వ విద్యార్థులు అభినందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘ కన్వీనర్ తన్నీరు శివశంకర్, సభ్యులు చుక్కా భానుప్రసాద్, కాసారనేని శ్రీనివాసరావు, కఠారి సీతారామయ్య, పి.నరేంద్ర, శివభాస్కర్, శ్రీను, పసుపులేటి మోహనరావు, ముద్దబత్తుని రమణయ్య, ఈఎల్‌వి. అప్పారావు, ఎస్ఆర్‌కె శర్మ, చందు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కాలీగ్రాఫ్‌లో ఉచిత శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గురువారం విద్యార్థులకు అందమైన చేతిరాత(కాలీగ్రాఫ్)పై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మల తెలిపారు. సెయింట్ ఆన్స్ విద్యాసంస్థల సుపీరియర్ సిస్టర్ ఆదేశాల మేరకు సుహస్త అకాడమీ(హైదరాబాద్)కు చెందిన శిక్షకురాలు కె.భాగ్య శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా నాలుగు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు కర్సివ్ రైటింగ్, లూసిద వంటి వాటి గురించి వివరించారు. అక్షరాలు, పదాలు పొందికగా రాసే విధానాలు విద్యార్థులకు నేర్పించుతున్నట్లు తెలిపారు. ఏ నుంచి జెడ్ అక్షరం వరకు జాయినింగ్ అక్షరాలు రాసేవిధానం, పదాలు, పేరా గ్రాఫ్ ఎప్పుడు వాడాలో వివరించారు. శిక్షణ మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సిస్టర్ కె.నిర్మల తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.